


'ఒకే ఒక్క మిథునం' పుస్తకం కావలసినవారు కనీసపక్షం 10 కాపీలు కొనాలి – ఒకటి మీకూ, మిగిలిన తొమ్మిదీ మీ స్నేహితులకూ, బంధువులకూ బహూకరించడానికి!
10 కాపీలూ ₹ 300/–లకే లభ్యం! ఎమ్.ఓ/మల్టీ సిటీ చెక్/డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ₹ 300/– పంపితే, ఖర్చులు భరించి రిజిష్టర్డు పోస్టులో పంపబడగలవు. **V.P.P. పద్ధతి లేదు!**
Cheque/DD to be drawn in favour of "VAHINI BOOK TRUST" payable at "Hyderabad" and sent to : Vahini Book Trust, 1-9-286/2/P. Vidyanagar, Hyderabad - 500 044

'జ్యోతి' మాసపత్రిక వ్యవస్థాపక మేనేజింగ్ ఎడిటర్

వి. వి. రాఘవయ్యగారి స్మారక

# ఆహ్లాదకర కథల పోటీ!

**బహుమతుల మొత్తం : రు. 18,000/- :: ఒక్కొక్క కథకు రు. 1,500/- చొప్పున 12 బహుమతులు!**

సినిమాలు కానీండి, సాహిత్యం కానీండి - అవి రెండు రకాలుగా చూసేవారిని, చదివే వారిని ప్రభావితం చేసి ఆకట్టు కుంటాయి. మనసును కలచివేసి ఆలోచింపజేసేవి కొన్నీ, మనసును చికాకుల నుండి తప్పించి ఆహ్లాదపరచేవి మరికొన్నీ. ఈ రెండు రకాల్లోనూ నిష్ణాతులైన వారు అద్భుత ఫలితాలు సాధించి ప్రజాజీవనాన్ని ఉత్తేజపరిచారు. ఆహ్లాదపరిచే రచనలు చదివితే మనసు తేటబారుతుంది. తద్వారా కుటుంబంలోనూ, బైటి పరిచయస్థులతో మెలిగేటప్పుడూ ఆ తేటబారిన ఆహ్లాదకర మనసు ప్రవర్తించే విధానం సజావుగా ఉండి తోటివారి మెప్పు, మన్నన పొందేలా చేస్తుంది. తద్వారా సభ్య సమాజంలో నిర్మలమైన మనసుతో మనుగడ సాగించే వెసులుబాటు కలుగుతుంది. ఇది మంచి సమాజం రూపుదిద్దు కోవడానికి పరోక్షంగా దోహదపరడుతుంది. అందుకే - ఈ

**ఆహ్లాకర కథల పోటీ!**

## రచయిత / రచయిత్రులకు సూచనలు

- కథాంశం ఏదైనా ఆహ్లాదకరంగా ఉండాలి. నీతులను గానీ, సందేశాలను గానీ, క్లిష్టమైన విషయాలను గానీ చెప్పాలనుకున్నా అవి ఈ ఆహ్లాదకర చట్రంలో సజావుగా ఇమిడిపోవాలి.
- ఇంతకు ముందు ఎక్కడా ప్రచురితం కాని/పరిశీలనలో చేని రచనల్ని మాత్రమే పోటీకి పంపాలి. హామీపత్రం తప్పనిసరి!
- కథలు వ్రాతప్రతిలో 10-12 పేజీలు ఉంటే ఉభయతారకం!
- అను, ఐలీప్, లేఖిని, బరహ, యునికోడ్, విజన్ - చిత్ర, మేఘన, శ్రీలిపి లలో టైపు చేసిన వారు సాఫ్ట్ కాపీలు సిడిలలో పంపవచ్చును. ఇ-మెయిల్ ద్వారా కథల సాఫ్ట్ కాపీలు పంపినా హార్డ్ కాపీలు తప్పనిసరిగా పంపాలి.
- తగినన్ని పోస్టలు స్టాంపులు అంటించిన స్వంత చిరునామాగల కవరు జతచేసిన వారికి మాత్రమే ప్రచురణకు స్వీకరింప బడని కథలను త్రిప్పి పంపడం జరుగుతుంది. అయినా, పోస్టల్ మిస్సింగ్స్‌ను దృష్టిలో ఉంచుకుని, జెరాక్స్ కాపీలు ఉంచుకోవడం మంచిది.
- బహుమతులు పొందని కథల్లో కొన్ని సాధారణ ప్రచురణకు స్వీకరించబడతాయి. ఆ వివరాలు 'రచన'లో ప్రచురింప బడతాయి. వాటికి ప్రత్యేకంగా పారితోషికం అంటూ ఉండదు.
- న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు లేదు.
- కథకులు తమ చిరునామా; ఫోన్ నెం; ఇ-మెయిల్ వివరాలు స్పష్టంగా రాయాలి.
- పొట్టిపేర్లు, కలంపేర్లు ఉపయోగిస్తుంటారు కొందరు కథకులు. అంచేత చెక్కుల మీద రాయాల్సిన పేరు స్పష్టంగా తెలియజేయాలి.
- ఇంతకుముందు కొన్ని సందర్భాలలో కొందరు కథకులు ఫలితాల ప్రకటన తర్వాత తమ కథలను ప్రచురింపవద్దని కోరారు. ఇది సత్సంప్రదాయం కాదు. న్యాయనిర్ణేతల నిర్ణయాన్ని ఆమోదించ యిచ్ఛగించని వారు పోటీలలో పాల్గొనకుండా ఉంటే మంచిది! అలాగే ప్రచురణ గురించి ఒత్తిడి తెచ్చే వారి కథల ప్రచురణ జరగకపోయే అవకాశం ఉంది.

**ఈ 'ఆహ్లాదకర కథల పోటీ'ని స్పాన్సర్ చేస్తున్నది**
**'జ్యోతి' వి.వి. రాఘవయ్యగారి కుమారులు శ్రీ వెల్లంకి జయదేవ్‌గారు**

**ముగింపు తేది : అక్టోబరు 20, 2012 :: ఫలితాల ప్రకటన : సంక్రాంతి** (జనవరి, 2013) సంచికలో

**రచనలు పంపవలసిన చిరునామా :**

'రచన' ఇంటింటి పత్రిక ; 1-9-286/2/P ; విద్యానగర్ ; హైదరాబాద్ - 500 044

సంపుటి : 12
సంచిక : 5
ఆగస్టు : 2012

# రచన ఇంటింటిపత్రిక

237

పేజీలు : 100
వెల : ₹ 25/-

ముఖచిత్రం : రాచకొండ విశ్వనాథశాస్త్రి

చిరునామా : 1-9-286/2/P ; "యడ్లపాటివారి ఇల్లు" ; విద్యానగర్ (రాంనగర్ గుండు దగ్గర); హైదరాబాద్ - 500 044
ఫోన్ : (ఆ) : 040 - 2707 1500 :: (ఇ) : 040 - 2707 7599
*email : rachanapatrika@hotmail.com, rachanapatrika@gmail.com ; www.rachana.net*

సంపాదకీయం..... 5

## కథలు

రాచకొండ రచనా పురస్కార గ్రహీతల కథాపీఠం కథలు

సమస్య - అర్నాద్ 23
పంపకాలు - సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి 54
కర్ణులు - వివిన మూర్తి 74

ప్రియమైన శత్రువు - తాటిపాముల మృత్యుంజయుడు 39
అమ్మ అమెరికా పిల్లలూ! - కల్లూరి శ్యామల 42
అక్రమార్క సింహాసనం - వసుంధర 49
టార్గెట్ - వై. రుక్మిణీదేవి 65
మొక్కుబడి - పి.వి. శేషారత్నం 70
అంతఃచక్షువు - ఎలక్ట్రాన్ 86

## సీరియల్ రచనలు

శత్రుదేవోభవ - వసుంధర 11
రామకాండం - కవన శర్మ 30
ఆకాశవాణిలో నా అనుభవాలు - డి. వెంకట్రామయ్య 92
అమెరి'కాకమ్మ'కబుర్లు - వంగూరి చిట్టెన్ రాజు 95

## శీర్షికలు

ఉత్తర రచన 6
పజిలింగ్ పజిల్ - 237 నిర్వహణ : సుధామ 8
అమృతవర్షిణి - డా॥ కె.వి.రమణ 53
సాహితీ వైద్యం - వసుంధర 78

## అక్కడక్కడక్కడా

కార్టూన్లు

**వచ్చే సంచికలో .....**

**రంగనాయకమ్మగారి పెద్దకథ :: ఇంటర్నెట్ పెళ్ళిచూపులు!**

**ఆహ్లాదకర కథ :: ఆద్యంతాల మధ్య అతను : సింగరాజు రామచంద్రమూర్తి**

The Views, Opinions expressed and Statements made by the Writers, Authors and Readers need not necessarily be those of the Editor and Management of Rachana Entinti Patrika.
All disputes will come under the exclusive jurisdiction of respective Courts and Forums situated in Hyderabad City only.

**సలహాదార్లు**
కాళీపట్నం రామారావు
కవన శర్మ
అత్తలూరి నరసింహారావు
వసుంధర
కోడూరి శ్రీరామమూర్తి
కేతు విశ్వనాథరెడ్డి
డా. ఎన్. సురేంద్ర
వై. రాంబాబు & శాయి
డా. డి.వి.ఆర్. పూషా



**మార్కెటింగ్**
**పచిపాల మార్కెటింగ్**
3-6-136/6, స్ట్రీట్ నెం. 17
హిమయత్‌నగర్, హైదరాబాద్-29
ఫోన్ : 040 - 40077558
మొబైల్ : 9848630702

*సంపాదకుడు*
**వై.వి.యస్.ఆర్.యస్.తల్పశాయి**
***అసోసియేట్ ఎడిటర్***
'హంసలేఖ'

***The Only Magazine Administered by Writers***

**రా**చకొండ విశ్వనాథశాస్త్రిగారి రచనా మార్గాన్ని అనుసరించి కథా రచనలు చేసిన, చేస్తూ ఉన్న రచయితలకి ప్రతియేటా పురస్కారంగా 5000 రూ॥; దారి, వసతి ఖర్చులకుగాను 1000 రూ॥ - వెరసి అక్షరాలా 6000 రూ॥ ఇవ్వటానికిగాను "రాచకొండ రచనా పురస్కార సమితి" ఏర్పడింది.

దీనికి అధ్యక్షులు కాళీపట్నం రామారావుగారు, కార్యదర్శి 'రచన' శాయిగారు, కోశాధికారి కవనశర్మగారు.

ప్రతీ సంవత్సరం సాహితీ అభిమానులు సూచించిన పేర్లను పరిశీలించి పై ముగ్గురూ పురస్కారం ఎవరి కివ్వాలన్నది నిర్ణయిస్తూ వస్తున్నారు.

1998లో భూషణంగారికి; 1999లో (శ్రీమతి) బీనాదేవిగారికి; 2000లో పతంజలిగారికి; 2001లో కేతు విశ్వనాథరెడ్డిగారికి; 2002లో డా॥ కేశవరెడ్డిగారికి; 2003లో వివినమూర్తిగారికి; 2004లో సొదుం జయరాంగారికి; 2005లో సింగమనేని నారాయణగారికి; 2006లో 'అర్నాద్'గారికి; 2007లో తుమ్మేటి రఘోత్తమరెడ్డిగారికి; *'రాచకొండ రచనా సాగరం'* ఆవిష్కరణ సందర్భంగా జూలై 30, 2007న అట్టాడ అప్పలనాయుడుగారికి, 2008లో తాడిగిరి పోతరాజుగారికి, 2009లో యం. రామకోటిగారికి, 2010లో డి.వెంకట్రామయ్యగారికి, 'ఓల్గా'గారికి, 2011లో చిలుకూరి దేవపుత్రగారికి; గంటేడ గౌరు నాయుడుగారికి, 2012లో సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డిగారికి 'రాచకొండ రచనా పురస్కారం' ఇవ్వడం జరిగింది.

గత పదిహేను సంవత్సరాల కాలంలో ఈ పురస్కారాలను శ్రీకాకుళంలో పదకొండు; విశాఖపట్టణంలో రెండు; హైదరాబాదులో రెండు; బెంగుళూరు, పార్వతీపురం, కడప పట్టణాల్లో ఒక్కొక్కటి చొప్పున ఇవ్వడం జరిగింది. ఇందునిమిత్తం పురస్కార సమితికి వచ్చిన రాబడి రు.1,47,734/- కాగా పోబడి కూడా రు.1,47,734/-గా తేలింది.

మేము కోరినా రాచకొండ రచనా పురస్కారాన్ని తమకున్న కొన్ని కారణాలతో అంగీకరించని కథకులు కొందరున్నారు. అలానే మా కెందుకివ్వరూ అన్నవారూ, ఫలానా వారి కెందుకివ్వరూ అన్నవారూ కొందరున్నారు. ఎవరే పని తలపెట్టినా అది ప్రతి ఒక్కరికీ ఆమోదయోగ్యం కావడమన్నది అసంభవం! ప్రతీ కార్యక్రమానికీ కొన్ని పరిమితులు నిర్దేశించుకోవడం తప్పనిసరి! అందుకు 'రాచకొండ రచనా పురస్కార సమితి' కూడా మినహాయింపు కాదు. తదనుగుణంగానే ఇప్పటి వరకూ 18 మంది కథకులకు ఈ పురస్కారాన్ని అందజేయడం జరిగింది. పురస్కార నిర్వహణ సమితి సభ్యులకున్న పరిమితుల దృష్ట్యా ఇంతటితో ఈ పురస్కార ప్రదానాలకు ఒక ముగింపు నివ్వాలనే నిర్ణయానికి రావడం జరిగింది.

ఇన్నేళ్లుగా ఈ 'రాచకొండ రచనా పురస్కారం' నిర్వహణకు విరాళాలిచ్చి ఆర్థికంగా తోడ్పడిన రావిశాస్త్రిగారి సాహిత్య ప్రేమికులకూ, పురస్కార ప్రదానోత్సవాల నిర్వహణకు అనేకానేక ప్రదేశాలలో సహాయ సహకారాలందించిన మిత్రులకూ, మా అభీష్టాన్ని మన్నించి పురస్కారాలను స్వీకరించిన పద్ధెనిమిది మంది కథకులకూ పేరు పేరునా మా కృతజ్ఞతాభివందనాలు!

శాయి

**237**

# ఉత్తరం రచన



'రచన' పత్రిక సక్రమంగా అందుతోంది. మీ నిరంతర సాహితీ సేవకు జేజేలు!

– వి.సి.వి.చయనులు (వియన్నా)

*(బీనాదేవిగారి కథ 'థేంక్స్ ఫర్ ది పి.యమ్.'లో అసలర్థానికి బదులు పి.యమ్.అంటే పోస్ట్ మాస్టర్ అని అన్వయించుకోవాలనిపిస్తోంది. – సం॥)*

నేను 'రచన' పత్రికని చాలా సంవత్సరాల నుంచి చదువుతున్నాను (చందా నం: 2953). అందులోని కథలు, వ్యాసాలు, పత్యేక సంచికలకి ఒక గుర్తింపు ఉందని నా అభిప్రాయము. తెలుగు భాషకు మీరిచ్చే పాధాన్యత కూడ గ్రహించాను. ముంబాయిలో ఉంటూ తెలుగు భాషతో సంబంధం పెంచుకోడానికి తోడ్పడుతోంది కూడాను.

మా శ్రీవారు పముఖ వ్యంగ్య చిత్రకారులు 'విన్స్' కలం పేరుతో నలభై ఐదేళ్ళుగా దేశ విదేశాలలోని పత్రికలకి వ్యంగ్య చిత్రాలు చాల వేస్తూంటారు. జూలై రీడర్స్ డైజెస్ట్‌లో వారి ఇలస్ట్రేషన్స్ చూడగలరు. దూరదర్శన్ ఛానెల్ ప్రసారం చేసిన 'ఎమినెంట్ కార్టూనిస్ట్ ఆఫ్ ఇండియా'లో ఒకరిగ అరగంట పోగ్రాములో చూపించారు.

మా పెళ్ళి అయిన తర్వాత తెలుగు కార్టునిస్టులతో పరిచయం కూడా బాగానే పెరిగింది. నేను కూడ నాకున్న అవగాహనతో కార్టూన్లు చూస్తూ ఉంటాను. నేను చదివే పత్రికల్లోని కార్టూన్లు మా వారికి చూపిస్తూ ఉంటాను. కనుక మేము చూసి, నచ్చని విషయన్ని మీ దృష్టిలోకి తేవాలని అనుకొని ఈ ఉత్తరం రాస్తున్నాను.

జూలై నెలలోని సంచికలో చాల తక్కువ కార్టూన్లు ఉండటం గమనించాము. ఉన్న వాట్లలో ఆఖరి పేజీ(98)లోని కార్టును మమ్మల్ని ఆశ్చర్య పరిచింది. ఒకటి – ఆడపిల్ల, కట్నం గురించి వ్యాఖ్యానించడం; రెండు – చిన్న పిల్లాడు ఆస్తి గురించి మాట్లాడడం, 'అబార్షన్ చేసుకో' అని – అదీ, తల్లితో చెప్పడం ఎంత సబబు? మాకైతే మింగుడు పడలేదు? వంగూరి చిట్టెన్‌రాజుగారి 'అమెరి'కాకమ్మ' కథలు' వ్యాసంలో ఇది ఇమడలేదు అనిపించింది కూడాను.

– డా. రాజ్యలక్ష్మి సేథ్ (ముంబై)

*(ఇప్పటి పిల్లల సంకుచిత ఆలోచనా ధోరణిని ప్రతిబింబిస్తున్నదనే ఉద్దేశ్యంతోనూ, కడుపులో ఉన్నది ఆడపిల్ల అయితే ఎబార్షన్ చేయించుకోవడం ఒక అవసరంగా భావిస్తున్న నేటి రోజుల్లో దాన్ని ఎండగట్టడానికి దోహదపడుతుందనే ఆలోచనతోనే ఆ కార్టూన్‌ని ప్రచురించడం జరిగిందిగానీ మరేమీ కాదు. – సం॥)*

మీరేం మంత్రం వేశారోగానీ, 'రచన' పత్రిక రెగ్యులర్‌గా అందుతోంది.

– శారద (అడిలైట్)

*(మంత్రం ఏమీ లేదు. అంతకు ముందు ఇక్కడి వారికి పోస్టు చేసే చోట కాకుండా జిపిఒలో పోస్టు చేస్తున్నానంతే! – సం॥)*

ఈ నెల 'రచన' బహుబాగు. కథలు కనక పుష్పాలకు తావి అబ్బినట్లున్నాయి.

ముఖ్యంగా మెడికల్ కథ 'శృతిమించిన రాగం' – అత్యద్భు తం! ఎన్నో సందేహాలను తీర్చి, ఆరోగ్యపర సందేహాలు తీర్చి, సందేశాన్ని అందించిన కథ. ఆరోగ్య సూత్రాలను ఇలా కథగా అందించిన వేమూరి వారికి వేయి కృతజ్ఞతాంజలులు!

ఇహ 'మహా యన' ఎంతో హాస్యభరితంగా ఉంది. మేం ఎప్పుడూ అనుకుంటుం టాం – 'యనమః' ఏంటని? దాన్ని కథావస్తువులో చొప్పించడంలో చొరవ చూపారు శ్రీఉదయిని.

'ఊతం' కథతో 'రచనకు రవళి వచ్చింది. కాకానిగారికి హ్యాట్సాఫ్!

'చంద్రముఖి'లో రాహుల్ తల్లి శారదమ్మలాంటి వారు ఈనాడు తల్లులందరికీ ఆదర్శం. రాధిక వంటి స్నేహితులూ సమాజానికి అత్యవసరం.

కథల్లో పాత్రల ద్వారా సమాజాన్ని కళ్ళకుకట్టిన 'రచన' పత్రిక మేటి పత్రికల్లోనే మేలైనదని చెప్పకుండా ఉండలేకపోతున్నాను.

ఇహ 'సాహితీ వైద్యం' రచయితల మానసిక రుగ్మతలకు చక్కని వైద్యం. సహకారం అందిస్తున్న, కౌన్సిలింగ్ ఇస్తున్న తీరు బావుంది. ఇంతకాలంగా 'రచన' చదువుతున్నా, ఈ నెల మాస పత్రికంత హాయిగా ఏదీ అనిపించలేదు.

అందుకే ఈ 'ఉత్తర రచన'.

– చంద్రశేఖర్ (బెంగుళూరు)

'పత్యేక రచన'గా వెలువడిన డా. ఎస్.వి. రామారావుగారి *'బస్సులో విజయవాడ నుంచి గుడివాడకు'* చదివాను.

చిత్రకారుడైన రామారావుగారు తన స్వీయానుభవాన్ని అక్షరబద్ధం చేసిన తీరు బాగుంది. పరిసరాల సవివర చిత్రణ – ఆ బస్సు పయాణంలోకి పాఠకుల్ని కూడా తీసుకెళ్ళేలా సాగింది.

*'నేను పుట్టిన గుడివాడ నాకు దూరం'* అనే వాక్యం ఆలోచనలు రేపుతుంది. బతుకుతెరువు కోసం పల్లెల్ని దాటి పట్టణాల్లో, నగరాల్లో స్థిరపడిన ఎందరో జ్ఞాపకాలను తట్టిలేపేలా ఉంది ఆయన అనుభవం.

ఇది కథో, సంఘటన తలపోతో… ఏదైతేనేం? ఆసక్తికరంగా చదివించి, ఆపై సంతృప్తిని కలిగించిన రచన.

– వేణు (హైదరాబాద్)

❖

# రామ కౌండం

*(గత సంచిక తరువాయి)*

## ఆరవ కాండం

## ఇద్దరు గొప్ప బలశాలులు

**రా**ముడు రావణుని సంహరించాక అగ్నిలో నడిచి రాముడిని సీత చేరింది. ఆమెను తీసుకొని రాముడు వచ్చిన దారినే బయల్దేరాడు. దారిలో హనుమంతుడు సముద్రాన్ని దాటినప్పుడు విశ్రాంతి తీసుకొన్న మైనాక పర్వతాన్ని, తాను నిర్మించిన సేతువుని సీతకు చూపాడు. కిష్కింధ చూపించాడు. సుగ్రీవుడి భార్య రుమ, వాలిని పోగొట్టుకొని సుగ్రీవుడి పంచన చేరిన తార, ఇతర వానరులు రాముడి పట్టాభిషేకం చూడటానికి ఆయోధ్యకి బయల్దేరారు. అడవి విడచిపెట్టి వెళ్తున్న వానరులు, రాముడితో లంకకు వెళ్ళిన వానర వీరులు, సుగ్రీవ, హనుమంత అంగదాదులు తమ తోకలను తీసి వాటిని వారి గృహాల్లో భద్ర పరిచి మామూలు మానవ రూపాల్లో అయోధ్యకి బయల్దేరారు.

రాముడు, సీత తిరిగి భరద్వాజ ఆశ్రమం చేరారు. తాము వాల్మీకి ఆశ్రమం వదిలాక జరిగిన కథ యావత్తూ భరద్వాజుడికి వివరించారు.

"ఇదంతా రామాయణ కావ్యం రచిస్తున్న మా గురుదేవుడు వాల్మీకికి చెప్పాలి" అనుకొన్నాడు భరద్వాజుడు.

❖ ❖ ❖

ఇక్ష్వాకుడి సోదరుడు దండకుడు గోదావరి తీరానే ఉండి పోయి రాక్షస స్త్రీని వివాహం ఆడాడు. రాక్షసుల సహాయంతో గోదావరి నుంచి నర్మద వరకు తన అధికారం చెల్లించుకొంటు న్నాడు. గోదావరి నుండి కృష్ణ వరకు వ్యాపించి ఉండిన దట్టమైన అడవులలో వైవస్వతుడి నుంచి సంక్రమించిన రాజ్యంలో అతని పాలన ఎప్పటిలా సాగుతూనే ఉంది.

కృష్ణకి దిగువన వాలి, కిష్కింధని పాలిస్తున్నాడు. వాలి గొప్ప బలశాలి. రావణుడిని కట్టడి చేయగలిగినవాడు. ధనుర్బా ణాలు పట్టగలిగినవాడు.

లంక నుంచి సవతి అన్న, తన కంటే బాగా వయస్సులో పెద్దవాడు అయిన కుబేరిడిని తరిమివేసి పులస్త్యుడి మనవడు, విశ్రవుడికి కైకసికి పుట్టిన మహా బలశాలి అయిన రావణుడు లంకలో రాజ్యమేలుతున్నాడు.

దండకుడితోడి బంధుత్వం వలన రావణుని సవతి చెల్లెలు శూర్పణఖ, సవతి తమ్ముడు ఖరుడు గోదావరి తీరాన్న యధేచ్ఛగా ఉంటున్నారు.

అమ్మమ్మ వరసైన తాటకి, మేనమావ వరసైన సుబాహుడు చనిపోయాక, రావణుని మరో వేలువిడిచిన మేనమావ కిష్కింధకి పారిపోయాడు.

కిష్కింధా ప్రభువైన వాలితో రావణుడు చేసుకొన్న ఒప్పం దం వలన అది సాధ్యమైంది. ఆ ఒప్పందం వలననే రాక్షసులు లంక నుంచి యధేచ్ఛగా దండకారణ్యం ప్రవేశించగలుగు తున్నారు. అక్కడికి వచ్చిన ఔత్తరాహిక ఋషుల రాకకి అడ్డు పడ్తున్నారు. ముందర ధర్మప్రచారకులు, వారి వెంట ఆ పైన సామ్రాజ్య స్థాపకులు వస్తారన్నది రాక్షసుల వాదన.

ముందర స్నేహంగా వచ్చినవారే ఆ పైన తమని ఇబ్బంది పెడ్తారని, అందుచేత రాక్షసులతో తాము చేసుకొన్న ఒప్పందం వలన తమకి ఒరిగేది ఏమీ లేదని, తమకి ఇటు లంకలోకి కాని, అటు దండకారణ్యంలోకి గాని వెళ్ళే అవసరం గాని కోర్కె గాని లేదన్నది సుగ్రీవుడి వాదన. అతని వాదనకి హనుమంతుడి సమర్ధన. ఆలోచనాపరుడు జాంబవంతుడి వత్తాసు.

ఆ ఒప్పందానికి కారణం పూర్వం రాక్షసుల కిష్కింధా ప్రవేశ ప్రయత్నాలను అడ్డుకోవటంలో జరిగిన వానర రాక్షస ఘర్షణలు. ఒప్పందమయ్యాక వాలి, సుగ్రీవుల మధ్య ఘర్షణ మొదలైంది.

❖ ❖ ❖

రాముడు చెప్పిన సీతాపహరణ వృత్తాంతం అంతా విని, "రామా! శూర్పణఖ వలననే ఇదంతా జరిగిందన్నమాట!" అన్నాడు భరద్వాజుడు.

"అవును. నాకు విభీషణుడు రావణుని వృత్తాంతం అంతా చెప్పాడు. రావణుడు తన అధికారానికి భంగం వాటిల్లుతోందని నమ్మినపుడు మాత్రమే దుష్కార్యాలకు దిగే నైజమున్నవాడు. సీతను ఎత్తుకు వచ్చేవరకు శూర్పణఖ రావణాసురుడిని ఎత్తి పొడుస్తూనే ఉంది. ఎత్తుకువచ్చాక 'నాకంటే ఆమె ఏం గొప్ప

## రెండో మాట

# రెండు తప్పులు

మనుష్యులందరికి విశ్వాసాలుంటాయి. అవి వారి పరిమిత అనుభవాల వలనో, ఆప్తులు వాటిని బలంగా సమర్థించటం వలనో ఏర్పడ్తాయి. అవి ఒకసారంటూ ఏర్పడ్డాక వాటిని బలపరిచే నిదర్శనాలని అనుభవాలని (Data) వారు పోగు చేసుకుంటూపోతారు. అయితే విజ్ఞానశాస్త్రంలోని సంఖ్యా సంభావ్యతా శాఖతో పరిచయం ఉన్నవారు వారి విశ్వాసాలని సత్యాలుగా స్వీకరించడంలో వారికున్న ధైర్యంయొక్క స్థాయిని 70 శాతం, 95 శాతం అంటూ అంకెలతో చెప్తూ ఉంటారు. దీనిగురించి పరిచయం లేనివారు, అవతలివాళ్ళు 'అది' 95 శాతం స్థాయిలో సత్యంగా స్వీకరిస్తున్నాం అని చెప్పినప్పుడు 'అది' సత్యం అవటానికి సంభావ్యత 95 శాతం అనుకొంటారు. కాని దాని అర్థం అదికాదు. దీన్ని ఈ కింది ఉదాహరణతో వివరిస్తాను. మనం స్వీకరించే విశ్వాసాన్ని శూన్య ప్రతిపాదన (Null hypothesis), అంటాం.

శూన్య ప్రతిపాదన: రామాయణంలో చరిత్ర ఉంది

ధైర్యం స్థాయి (confidence level) : 95%

మొదటి తప్పు (type 1 error) రామాయణంలో చరిత్ర ఉండి లేదనుకొనే తప్పు. ఈ పొరపాటు 100కి 5 సార్లు మాత్రమే జరగనివ్వాలి. అంటే బలమైన, వ్యతిరేకమైన, సాక్ష్యం (నిదర్శనం, అనుభవం – data) లేకపోతే మన ప్రతిపాదనని స్వీకరిస్తాం అన్నమాట. అంటే 100కి 95 సార్లు ఆ పొరపాటు చెయ్యం, జరగనివ్వం.

అసలు గమ్మత్తు ఇక్కడే ఉంది.

అంటే అది సత్యంగాని సందర్భాలలో కూడా దాన్ని సత్యంగా స్వీకరించే ప్రమాదం హెచ్చుగానే ఉంటుంది.

రెండో తప్పు (type 2 error) : అది సత్యమే అయివుండి దాన్ని నిరాకరించే పొరపాటు 100కి 5 సార్లే జరగాలన్న నియమం పెట్టుకొన్నప్పుడు, అది సత్యం కాకపోయినా సత్యంగా స్వీకరించే పొరపాటు 100కి 5 సార్లకంటే బాగా ఎక్కువగానే జరుగుతుంది.

మనం 'రామాయణంలో చరిత్ర లేదు' అనే శూన్య ప్రతిపాదనని 95 శాతం ధైర్యంతో స్వీకరిస్తున్నాం అంటే అది చరిత్ర కాకపోయినా చరిత్రగా స్వీకరించే పొరపాటు 100కి 5 సార్లు మాత్రమే జరగనిస్తాం అన్నమాట. ఈ విధంగా ప్రతిపాదన ఏర్పరచుకొన్నప్పుడు రామాయణం చరిత్రే అయినా దాన్ని నిరాకరించే పొరపాటు 100కి 5 సార్ల కంటే బాగా ఎక్కువగానే జరుగుతుంది.

న్యాయశాస్త్రంలో నిర్దోషి శిక్షింపబడకూడదన్న నియమం వలన ఎన్నోసార్లు దోషులు తప్పించుకోవడం, మన అనుభవంలో, చాలాసార్లు జరగటం చూస్తాం. దోషులకి శిక్ష పడాలి అన్న నియమం పెట్టుకొంటే చాలాసార్లు నిర్దోషులకి శిక్ష పడుతుంది.

ఈ శాస్త్రీయ చర్చలో ప్రభుత్వ శాఖల, న్యాయవ్యవస్థయొక్క 'అవినీతి'ని ఒక పరామితి(parameter)గా తీసుకోలేదు.

అంటే మనం సత్యంగా స్వీకరించదలచుకొన్న విషయం మన విశ్వాసాలపై ఆధారపడి ఉంటుంది. ఇది సైన్సు ఒప్పుకొనేదే. అంకెలలో ధైర్యం స్థాయి నిర్ణయించటం అన్నింటా సాధ్యం కాదు. విషయాలకి తారతమ్య విలువల నాపాదించడం ద్వారా సాధ్యం చేయవచ్చు. కాని, ఆ విలువల ఆపాదన వ్యక్తినిష్టం (subjective) అని గుర్తించాలి.

– కవనశర్మ

అందకత్తె!' అని మండోదరి సాధిస్తూనే ఉంది"

"విభీషణుడు, తల్లి, ఇతర హితులు 'అది వినాశనం కొని తెచ్చుకోడం' అని రావణుడిని హెచ్చరిస్తూనే ఉన్నారు. పైగా రావణుడు అప్పటికే ముసలివాడు" అన్నాడు రాముడు.

"రావణుడు శూర్పణఖతో గట్టిగా ఆ పని చెయ్యనని ఎందుకు చెప్పలేకపోయాడు?" అని భరద్వాజుడు రాముడిని అడిగాడు.

"శూర్పణఖ భర్త అయిన విద్యుజ్జిహ్వుడు దండకారణ్యంలో బలం సంపాదించుకొని ఆ బలగర్వంతో, సోదరులైన కాలకేయులతో చేరి రావణుని ఎదురించి నిహతుడయ్యాడు. అప్పటికి శూర్పణఖ మధ్య యౌవని. ఆమె ఏడుస్తూ రావణుని వద్దకు వెళ్ళి 'నేనెల్లా బతకను?!' అని అడిగింది. 'నువ్వు నీకు నచ్చినవాడి నెవరినైనా సరే మళ్ళీ పెళ్ళిచేసుకో. ఈ రావణునితో బంధుత్వం

(మిగతా భాగం పత్రికలో చదవండి)

# అక్రమార్క సింహాసనం

ఉదయం ఐదున్నర.

గంగారావు, ఆయన మిత్రుడు సూర్యనారాయణ – పార్కులో బ్రిస్క్ వాక్ చేసి ఇంచుమించు అదే స్పీడులో రోడ్డుమీద కొచ్చారు. గంగారావు రోడ్ క్రాస్ చేద్దామంటే – "ఏ పక్కనుంచి ఎప్పుడే కారొస్తుందో చెప్పలేం. కాస్త ముందుకెడితే జీబ్రా లైన్సొస్తాయి. అక్కడైతే మనకి సేఫ్" అన్నాడు సూర్యనారాయణ.

"ఇక్కడే దాటితే పావు కిలోమీటరు కలిసొస్తుంది. మన ఆరోగ్యానికి ఇంతవరకూ నడిచింది చాలు కానీ, పద" అన్నాడు గంగారావు. అంతలో దూరంగా కారొకటి కనిపిస్తే, "సరేలే, ఆ కారెళ్లాక వెడదాం" అన్నాడు సూర్యనారాయణ.

"దాని స్పీడు చూస్తుంటే తెలియడం లేదూ, అదిక్కడికొచ్చేసరికి మనం ఇంటికెళ్లిపోతాం" హేళనగా అని ముందడుగేశాడు గంగారావు.

సూర్యనారాయణకి కారు స్పీడుగా వస్తున్నట్లే అనిపించి ఆగిపోయాడు. ఆయన అనుకున్నట్లే గంగారావు రోడ్డు మధ్యకి వెళ్లేలోగానే కారొచ్చేసింది. డ్రైవర్ సమయస్ఫూర్తికి తోడు – సడన్ బ్రేక్ పని చెయ్యకపోతే ఆయన కారు కింద పడాల్సినవాడే!

గంగారావు ఒక్క ఉదుటున అవతల పక్కకెళ్లాడు. కారు ఆగడంతో సూర్యనారాయణ కూడా ఆయన్ను చేరుకున్నాడు.

డ్రైవర్ సీట్లో వ్యక్తి తలుపు తీసి కారు దిగాడు. విసుగ్గా గంగారావుని చూస్తూ, "కాస్త ముందుకెడితే జీబ్రా లైన్సొస్తాయి కదా. అక్కడ చెయ్యాల్సిన క్రాసింగ్ ఇక్కడ చేస్తే ఎలాగండీ?" అన్నాడు.

గంగారావాయన్ని ఉరిమి చూస్తూ, "జీబ్రా సంగతి చెప్పొద్దు. ఈ ఏరియాలో ఈ రోడ్డుమీద స్పీడు లిమిట్ మీకు తెలుసా?" అంటూ గర్జించాడు.

కారు ఓనర్ తడబడి, "అర్జంటు పనిమీద వెడుతున్నా. స్పీడు కాస్త ఎక్కువే ఉండొచ్చు. కానీ నడిచేటప్పుడు రూల్స్ పాటించక పోతే మీకే ఎక్కువ ప్రమాదం కదా! కారు కండిషన్లో ఉండి సడన్ బ్రేక్ పని చేసింది కాబట్టి కానీ – లేకపోతే మీకు కాలో చెయ్యో విరిగేది. ఒకోసారి ప్రాణానికే ముప్పు రావచ్చు" అన్నాడు అనునయిస్తూ.

"మీ కారున్నవాళ్లంతా ఇలాగే మాట్లాడతారు. మీ సమయస్ఫూర్తికి నా టైమ్‌సెన్స్ కూడా కలిసిరావడంవల్లే ప్రమాదం తప్పింది. ఇలా అంటున్నానని ఏమీ అనుకోకండి. కాలో చెయ్యో విరిగితే కాంపెన్సేషనివ్వాలి. అదీ కాస్తా కూస్తా కాదు, ఇక మనిషి చస్తే హత్యానేరం కింద ఉరిశిక్ష పడినా పడొచ్చు. మనుషులు తిరిగే రోడ్లమీద స్పీడ్ లిమిట్‌కి కాస్త దిగువనే ఉండడం మీకు మంచిది" అన్నాడు గంగారావు.

కారు ఓనర్ ఆయనతో గొడవెందుకనుకున్నాడో ఏమో – తనలో తనే గొణుక్కుంటూ మరి మాట్లాడకుండా కారెక్కాడు.

కారు కదలగానే, "ఏంటీ గొణుగుతున్నావ్?" అనరిచాడు గంగారావు. కారు స్పీడందుకుని వెళ్ళిపోయింది.

"రాస్కెల్. చేసింది చేసి ఇంకా గొణుగుడొకటి. పారిపోయాడు కానీ, ఈవేళ వాడి పని పట్టి ఉండేవాణ్ణి" అన్నాడు గంగారావు ఆవేశంగా.

"ఆయన్ననడమెందుకు? తప్పు మనలోనూ ఉందిగా" అన్నాడు సూర్యనారాయణ.

"తప్పు మనలో ఉందా – ఎలా?" అన్నాడు గంగారావు మరింత ఆవేశంగా.

సూర్యనారాయణ జవాబివ్వలేదు. చిరకాలమిత్రుడు కావడం వల్ల గంగారావు తత్వం ఆయనకి బాగా తెలుసు. కారు ఓనరుకి వినపడదని రూఢి అయ్యాకనే గంగారావు రాస్కెల్ అన్న పదం వాడాడని ఆయనకి తెలుసు. ఎంత ఆవేశమొచ్చినా తన జాగ్రత్త తనకి తెలుసు. ఇక ఆవేశాన్ని ఎలాగో అలా బయటపడేయకపోతే కడుపుబ్బరం కదా! అది తగ్గడానికి మరిప్పుడు తనే సాధనం. ఇప్పుడాయన ఎంత రెచ్చిపోయినా ప్రమాదం లేదు. అణుశక్తి – బాంబులో ఉపయోగిస్తే కీడు కానీ, రియాక్టరులో ఐతే మేలే కదా!

గంగారావు కసెక్కిపోయాడు. కారున్నవాళ్లకి పొగరన్నాడు. కండకావరమన్నాడు. ఇందాకటాయనపై స్కౌండ్రల్, బాస్టర్డ్ వంటి పదజాలాన్నుపయోగించి పవర్ చాలక తెలుగులోకి దిగిపోయాడు. కాస్త శాంతించేక, "నాకు రూల్సు చెబుతాడా? మన దేశంలో కార్లున్నవారెందరు? లేనివారెందరు? పదిమంది కోసం

(మిగతా భాగం పత్రికలో చదవండి)

వసుంధర

కథాపీఠం

# పంపకాలు

*అన్నదమ్ములమధ్య పంపకాలను ప్రోత్సహించేది మిత్రులు కాదు, శత్రువులు.*
*1947 ఆగస్టు 15 మనకి నేర్పిన మరిచిపోలేని గుణపాఠమది!*

– వసుంధర

తొలికోడి కూసింది.

వీధుల్లోని మంచాల మీదా, మిద్దెలపైని చాపల మీదా పడుకొని వున్న జనాల చెవుల పక్కగా కోడి కూత పిక్కటిల్లిందిగాని ఎవ్వరినీ నిద్రలేపలేకపోయింది.

వేసవికాలపు ఉక్కపోతతో కుమిలిన రేయి నాలుగవ జాముకంతా బయలెల్లా చల్లబడి, మనుషుల మీదకు మత్తుగా వాలిపోయి, వాళ్ల మగత నిద్రను కాస్తా దయ్యపు నిద్రగా మార్చింది. కోడి కూతను చెవుల్లోకి జొరబడకుండా చేసింది.

ఇంటింటికీ కాడెద్దులున్న కాలంలో, మజ్జిగ కుండలో కవ్వం తిరిగే రోజుల్లో మనుషులు కోడి కూతకన్నా ముందే లేచేవారేమో గాని, సగిరబొద్దు దాకా టీవీలు చూసే యీ కొత్త యుగాన నాలుగవ జాము నిద్రే అపురూపమైంది.

ఊరంతా నిద్రలో సొమ్మసిల్లిన ఆ సమయాన ప్రభాకర్‌కు మెల కువ వచ్చింది. రాత్రంతా నిద్రబట్టక వూరకే మసలుతూ వున్న అతని చెవుల్లోకి కోడి కూత సులభంగానే జొరబడింది.

వెన్నెల చల్లగా కురుస్తూ వుంది.

అంటు మిద్దెల మీద పడుకొన్న జనాల మధ్యన్నించి గురకలు విన్పిస్తున్నాయి.

తన పక్కనే నిద్రిస్తోన్న రాధ కూడా సన్నని గురక తీస్తోంది.

లేచి కూచుని ఆమెకేసి తదేకంగా చూశాడు.

పడుకునే దాకా ఎంతగా సతాయించిందనీ! సాయంత్రం లోపల వ్యవహారం చక్కబెట్టుకు పోయే కఠినత్వం తనలో లేనందుకు ఎంతగా వేడెక్కిందనీ! తాళాలేసి వచ్చిన ఇంటిని గురించి ఓవైపు ఆందోళన రేపుతూ, అభద్రతా భావంలోకి నెడుతూ చెలరేగింది.

దాని తాలూకు అలజడి రాత్రంతా తనకు నిద్రబట్టకుండా చేసింది.

మొబైల్ అందుకుని నెంబర్ డయల్ చేశాడు.

కనెక్టయ్యింది. రింగవుతోంది గాని ఎత్తలేదు.

మరోసారి డయల్ చేశాడు.

గూర్ఖా రాందాస్...గురకపెట్టి నిద్రబోతున్నాడు కాబోలు.

సంసారులు ఆదమరచి నిద్రబోయే యీ సమయాన్నే గదా అతను మేలుకొని కాపలా కాయవలసింది!

ప్రభాకర్‌కు కోపమొచ్చింది.

ఆ వెనకే ఇంటి భద్రత పట్ల అలజడి తన్నుకొచ్చింది.

మరోసారి డయల్ చేశాడు.

ఈ దఫా ఫోనెత్తాడు రాందాస్.

ప్రశ్నించబోయే లోపలే తను వాళ్లింటి పరిసరాల్లోనే ఉన్నట్లుగా చెప్పాడు. రాత్రంతా తిరుగుతూనే వున్నాడనీ. ఇంటిని గురించి బెంగపెట్టుకోనవసరం లేదనీ భరోసా యిచ్చాడు.

ప్రభాకర్ మనస్సు కుదుటబడింది.

దొంగలు జొరబడితే రెండు లక్షలకు తక్కువ కాకుండా నష్టం జరుగుతుంది.

సెలవులొస్తే చాలు ఉద్యోగుల ఇళ్ల మీద ఓ కన్నేసి ఉంచుతారు దొంగలు. ఇంటి తాళమూ, గేటు తాళమూ పడిందా ఇక ఆ యింటి పనయిపోయినట్లే!

ఎక్కడికి వెళ్ళినా వీలున్నంతవరకు సాయంత్రానికంతా తిరిగి ఇంటికి చేరుకోవలసిందే. పండుగలా శుభకార్యాలు లాంటివి తటస్థపడినప్పుడూ, ఇదిగో ఇలాంటి అవసర పరిస్థితుల్లో ఒకటి రెండ్రోజులు ఇంటికి దూరంగా ఉండక తప్పదు.... మానసిక అలజ డిని మోయకా తప్పదు.

మెల్లిగా లేచి నిల్చుని ఒళ్లు విరుచుకున్నాడు.

మిద్దె దిగి వీధిలో కొచ్చాడు.

ఇంటి ముందు మంచాల మీద అమ్మ, వదిన, పిల్లలు పడుకొని వున్నారు.

**2012 రాచకొండ రచనా పురస్కారం అందుకుంటున్న రచయిత తాజా కథ**

నాన్న గొడ్ల కొట్టం బదువులో వుంటాడు బహుశా.

వీధి మలుపులోని అరుగు వద్ద కెళ్ళాడు.

సిగరెట్ ముట్టించుకొని అరుగు మీద కూచున్నాడు.

దమ్ము లాగుతూ వుంటే మనస్సు లోపలి పొరల్లోని జ్ఞాపకాల పేటిక చిటపట చిట్లుతూ వుంది.

ఉద్యోగం రాకముందు ఇలాగే మిత్రులతో కలసి రాత్రిళ్లు రహస్యంగా బీడీలు కాల్చటం, అంటుకళ్లాలలో వాముల చాటున పక్క కళ్లాం అమ్మాయితో సరసాలాడటం, రేగడి చేలల్లో జమాయించి సేద్యాలు చేయటం, కొండగడ్డి మోపులు మోయటం, రాత్రిళ్లు పంట చేల వద్ద పందుల కాపలాలూ, గొర్ల దొడ్లకాడ మేలుకోవటాలూ, బావులు వంకలు వాగుల్లో ఆయిలింజన్లతో నీళ్ల తంటాలూ... ఒకటేమిటి?...ఉద్యోగం రాని ఆ రెండేండ్లూ అన్నకు తోడుగా ఎన్ని అగచాట్లు పడ్డాడనీ!

ఆ కష్టాలన్నిట్నించీ ఉద్యోగం తన్ను విముక్తుణ్ని చేసింది.

అంతో యింతో పల్లెలో ఉన్న సంబంధాల్ని పెళ్లి మరింత దూరం చేసింది.

అడపాదడపా ఒకటి రెండేళ్లు వ్యవసాయానికి సహాయపడుంటాడేమో! అటు తర్వాత సాధ్యపళ్లేదు....దాంతో పల్లెను దాదాపు మరచిపోయాడనే చెప్పవచ్చు...

పదేళ్లకు పైగానే అయ్యుంటుంది తను పల్లెలో నిద్రజేయక. ఏడాదికో రెండేళ్లకో ఒకసారి వచ్చినా తిరిగి ఆ రాత్రికే బస్సెక్కిపోతాడు.

ఇప్పుడు తప్పలేదు.

అన్న ఉండుంటే తాడో పేడో తేల్చుకుపోదామనే వచ్చాడు.

పసపు కొమ్ములు అమ్ముకొచ్చేందుకు ఆయన దుగ్గిరాల మార్కెట్టుకు వెళ్లాడుట.

ఎకరా పసపు నాటారుట. విత్తన కొమ్ములు యాభైవేల రూపాయలైతే, పైరును సాకేందుకు యాభైవేలకు పైగా ఖర్చయిందట. కొమ్ములు తవ్వి, ఉడకబోసి, రుద్ది, మార్కెట్టుకు తీసికెళ్లేసరికి మరో ముప్పై వేలయిందట. విత్తనం విత్తేటపుడు క్వింటా ఎండు కొమ్ముల మార్కెట్ రేటు పదిహేను వేలయితే, ఇప్పుడు మూడు వేల రూపాయలకన్నా కిందకు దిగిపోయిందట. ఎకరా మీద యాభై వేలకు పైగా నష్టమొస్తుందని నాన్న వాపోతున్నాడు.

మిరప పంట కూడా అంతేనట. అదీ పదిహేను వేల నుంచి రెండు వేలకు దిగిందట.

ప్రభాకర్‌కు ఆశ్చర్యమనిపించింది ఏమిటంటే – తాము మార్కెట్లో పసపు పొడి, మిరప పొడి ప్యాకెట్లు కొంటున్నారు. తనకు తెలిసీ సంవత్సరం ఇవతల వాటి రేటు ఒక్క పైసా కూడా తగ్గినట్టు లేదు. పంట పండించే వాడికి యీ విషయం తెలియదు. వినియోగదారుడు ఆలోచించడు. ఉత్పత్తిదారులు ఎంతగా నష్టపోతున్నారో వినియోగదారుడు అంతగా మోసపోతున్నాడు. మధ్యలో మార్కెట్టు పెద్ద దోపిడీ దారుగా తయారైంది.

ఈ కొద్దిపాటి విశ్లేషణ కూడా సంబంధిత అధికారుల్లో లోపించింది.

సిగరెట్ ఆఖరి దమ్ము లాగి నేలమీదేసి నలుపుతూ లేచి గొడ్ల కొట్టం కేసి నడిచాడు.

నాన్న మేలుకొనే ఉంటాడు బహుశా. తమ చిన్నతనాన తొలికోడి కూతకే లేచి, బానంత కడవతో పాటో, పద్యమో, తత్వమో పాడుకొంటూ ఊరబావికి వెళ్లి నీళ్లు తెచ్చేవాడు. ఎద్దులకు తాపి మేతేసి తెల్లారేతలికి కాడి గట్టేవాడు.

ముసలి ముప్పున అస్సలు నిద్రబడుతుందా?

తనెందుకొచ్చాడో అడగలేదింకా. భార్యా పిల్లలతో దిగి ఒక రాత్రి ఇక్కడే ఉన్నాడంటే కారణాన్ని పసిగట్టే వుంటాడు.

సిటీలో రియలెస్టేట్ వ్యాపారం జోరందుకుంది. బావమరదులు అందులో బాగా ఎదిగిపోయారు. ఎన్నేళ్ళని తన ఆస్తి పల్లెలో మగ్గిపోవాలి? దీన్ని అమ్మి అక్కడ ఇళ్ల స్థలాలు కొంటే పదింతలు వృద్ధి చేసికోవచ్చు.

నెల రోజుల్నుంచి రాధ పోరు ఎక్కువయింది. పల్లెలో ఆస్తి పంచుకొని అమ్ముకొద్దామని చెవిలో జోరీగలా రొదపెడుతోంది. కరకర కోస్తూ వుంది.

రాక తప్పలేదు పల్లెకు.

గొడ్ల కొట్టం దాటబోయే లోపలే బిదువులోంచి సన్నగా శ్రావ్యంగా నాన్న గొంతు... తను చిన్నప్పట్నించీ విన్నగొంతు... ఏదో తత్వం....

దగ్గరగా వెళ్లాడు.

*'తొక్కులాడితె తెల్లవారేనా? ఓ ఎర్రి మనసా*

*నిక్కి నూపితె సుక్క బొడిసేనా?*

*కొక్కొరోయని పురములోపల*

*కుక్కుటములూ కూయు వరకూ.... తొక్కులాడితె తెల్లవారేనా?'*

నవ్వొచ్చింది ప్రభాకర్‌కు.

తన్ను చూసి పాడినట్లే వుంది.

మంచం దగ్గరగా వెళ్లి నిల్చున్నాడు.

"ఎవురూ? ఎవురోరే?... నాయినా! సిన్నోడా..." అంటూ కీళ్లు చిటపటలాడుతోండగా లేచి కూచున్నాడు రామయ్య.

"కూకో నాయినా!" అన్నాడు కొడుకు కేసి చూస్తూ.

మంచమ్మీద కూచున్నాడు ప్రభాకర్.

పాత బొంత, చిరిగిన దుప్పటి.

*(మిగతా భాగం పత్రికలో చదవండి)*

సన్నపురెడ్డి
వెంకటరామిరెడ్డి

కథాపీఠం

# కర్ణులు

> కర్ణుడి దౌర్భాగ్యం పుట్టుకలో కాదు,
> తను సూతపుత్రుడినన్న న్యూనతా భావంలో ఉంది.
> – వసుంధర

"లక్ష్మీకాంతం మీకు తెలుసా?"

"తెలుసు"

ఆ ప్రశ్నకి నా జవాబు నా జీవితాన్ని మార్చేసింది. ఒకరు వచ్చి నా చేతికి టికెట్ ఇచ్చి, విశాఖపట్నంలో నన్ను రైలు ఎక్కించారు. రైలు మద్రాసు చేరగానే ఇంకొకరు వచ్చి నన్ను దించుకున్నారు.

నా పదవ ఏట 1934లో నేను మద్రాసులో అడుగు పెట్టాను. 1944లో అమ్మను మద్రాసులోనే పూడ్చి పెట్టాను. 1953లో మద్రాసుని వదిలేసాను. తిరిగి 55 ఏళ్ల తరవాత మద్రాసులో ఇప్పుడు కాలు పెట్టాను. నన్ను దించుకున్న మనిషి కారులో ఎక్కించి ఓ పెద్ద హోటలుకి తీసుకుపోయాడు.

మనసు పాత మద్రాసుని వెదుకుతోంది. మూర్ మార్కెట్ కాలగర్భంలో కలిసిపోయింది. నా కళ్ల ఎదురుగా విశాఖపట్నమే మారిపోయింది. మద్రాసు చెన్నై కావటంలో ఆశ్చర్యం ఏముంది? ఆ మార్పుల మీదకన్నా కలవబోయే మనిషి చుట్టూ నా ఆలోచనలు తిరుగుతున్నాయి. ఎలా ఉంటుంది లక్ష్మీకాంతం? ఇప్పుడు గుర్తొచ్చేనా నేను? ఎందుకు? ఆనాటి మొహమే స్థిరంగా నిలవటం లేదు. ఈనాడు ఎలా ఉంటుందో?! వాడు ఎలా ఉంటాడో? 51 చివరిలోనో 52 ఆదిలోనో పుట్టాడు. ఎంత తన్నుకున్నా కాలం స్పష్టం కావటంలేదు.

నన్ను హోటల్లో దించిన యువకుడు చక్కని తెలుగులో మాట్లాడాడు.

"సార్ వస్తారు. మీరు విశ్రాంతి తీసుకోండి. నా నంబరు మీ సెల్లో ఫీడ్ చేసాను. మీకు ఏం కావాలన్నా నన్ను పిలవండి. కారూ, నేనూ మీ కోసం కిందనే ఉంటాము" అన్నాడు.

✪ ✪ ✪

బాగా నిద్ర పట్టింది.

కాలింగ్ బెల్ మోతతో మెలకువ వచ్చింది. వాళ్లేనా?! దిగ్గుమంది మనసు. శరీరంలో కూడా ఆ ఉత్తేజం. దేహం సహకరించినంత వేగంతో వెళ్లి తలుపు తెరిచాను. ఎదురుగా నించున్న మనిషి నా ప్రతిరూపంలా కనిపిస్తున్నాడు. అతని శరీరం మీద ఖరీదైన దుస్తులు అతని ఆర్థిక పరిస్థితిని ప్రకటిస్తున్నాయి. వెనక మరెవరూలేరు. తిరిగి అతనివైపు చూసాను. నన్ను అంతవరకూ పరిశీలిస్తున్న చూపులు నా చూపు కలవగానే మారిపోయాయి.

"లోపలికి రానిస్తారా?"

"రండి" అంటూ తప్పుకున్నాను.

గబగబా వెళ్లి కుర్చీలో కూర్చున్నాడు. రూం సర్వీసుకి ఫోన్నించి కాఫీ చెప్పాడు. నేను తలుపు మూసి కూర్చున్నాను. అతను నన్ను చూడటంలేదు. కొంతసేపు పేపరు చూసాడు. అతని సతమతం తెలుపుతోంది పవర్తన. అంత సతమతమయే మనిషి నన్నిక్కడికి రప్పించటమెందుకు? నా ముసలి రక్తం కూడా ఉద్విగ్నతని విడిచి, ఆగ్రహం నింపుకుంటోంది. ఎటువంటి మర్యాదా, ఆప్యాయతా, పలకరింపూ అతనిలో కనిపించటంలేదు.

ఓ నిశ్చయానికి వచ్చినట్లు అకస్మాత్తుగా మాటలు మొదలు పెట్టాడు.

"మీకూ లక్ష్మీకాంతమ్మకీ పుట్టిన బాస్టర్డ్ నేను"

పట్టరాని కోపం వచ్చింది. ఓ అపరిచితునిగా భావించి ముడుచుకుని ఉన్న నా మనసు, ప్రయాణం ఆరంభమైనప్పటినుంచీ ఏవో అపరిచిత ఉద్వేగాలతో నిండి ఉన్న నా మనసు చేసిన ఊహలన్నీ ఆ మాటతో చెల్లాచెదరైపోయాయి. కోపం బయట పడటానికి తన్నుకుంటోంది. మాటల కోసం వెదుక్కుంటోంది.

"నా గురించి ఎలా తెలిసింది?" – ఓ తెలివితక్కువ పశ్న మాత్రం బయటకు వచ్చింది.

*(మిగతా భాగం పత్రికలో చదవండి)*

**2003 రాచకొండ రచనా పురస్కారం అందుకున్న వివిన మూర్తిగారి తాజా కథ**